


# మామిడితోపులో మమతలు

కథానిక

రమణశ్రీ

పంచాయితీబోర్డు నడినెత్తిమీద శ్రద్ధ వాలింది. బాదంచెట్టుకింద కూచున్న బిల్లు కలక్టరు ఆఫీసు లెక్కల్లోంచి బుర్రపైకెత్తి తాపీగా చూశాడు. గోడపక్క మామిడికొమ్మమీద పచ్చటి చిలక పలుకులు చిలకరిస్తోంది బిల్లు కలక్టరు మొహంకేసి చూస్తూ.

"పన్నులన్నీ వసూలు చేశావా?"

చెవుల్లోకి దూసుకుపోయింది అధికారికంఠం. బిల్లు కలక్టరు గుండెలో దుమ్ము రేగింది. చిలక రివ్వున యెగిరిపోయింది. నీళ్ళనముల్తూ, "చిత్తం చిల్లర బాకీలూ, చినచిన్న పన్నులూ" అంటూ నసిగాడు.

"కొత్తగావచ్చిన మనిషివి ఎంత చురుగ్గాచెయ్యాలోయ్, రేపు ఇరవై రెండుతో క్లోజయిపోవాలి."

బిల్లు కలక్టరు ఆ మాటలు వేదాక్షరాల్లావింటూ చిరుగుజోబీలోంచి, సిగరెట్టు తీశాడు.

బిల్లు కలక్టరు జీవితంలో అంతమాత్రంవాడే. ఇంకా పెళ్ళికాలేదు. అదో హాటినయం. ఐతేయేం? తల్లీ, తండ్రీ చదువుకోసం ఎగబడుతోన్న తమ్ముడూ, వయస్సుమించిపోతూ పెళ్ళీడులో చెల్లెలూ... వీళ్ళందర్నీ తప్పించుకు రోజుకో గుప్పెడు పొగ పీలుస్తున్నాడు.

'53 పాత ఫైళ్ళు తిరగేస్తున్నాడు. సాలి పురుగు కిటికీలో గూడల్లుతోంది. ఫైలుకంటుకుని ఊడొచ్చింది గూడు. గబగబా అన్ని బిల్లు బుక్కులూ సంచిలో సర్దుకొని బయల్దేరాడు పన్నుల వేటకి! వేటసరిగాలేకపోతే తన్నులే! పార్టీ కక్షలమధ్య వణుకుతూ బెణుకుతూ నడుస్తున్నాడు. ప్రెసిడెంటు గిరీకి పోటీచేసి ఓడిపోయి నాయినింటికెళ్ళి పన్నడిగితే పెద్దపేచీ! ప్రెజంటు ప్రెసిడెంటుని నోటికొచ్చినమాట లన్నాడు. నోరు మూసుకొన్నాడు తను! వాళ్ళదగ్గర్నుంచి పన్నులు వసూలు చేసుకునేసరికి తాతలు దిగొచ్చారు.

"రేపురా! మాపురా! నీ అబ్బసొమ్ము దాచబెట్టారనుకొన్నావా? అసలు మీబోర్డుకి పన్నెందుకివ్వాలని? మీరంతా ఏం చేశారని? రోడ్లా? రోగాలా?"

వాళ్ళందర్నీ దాటుకొచ్చేసరికి ప్రాణాలు కడతేరిపోతున్నాయి.

కంకరరోడ్డుమీద కాళ్ళీడ్చుకొంటూ నడుస్తున్నాడు. సాలిపేటలో అడుగు పెట్టబోతూంటే, నారప్పగుడిసె, ముందు కనిపించింది. గుడిసెకి రెండేళ్ళనించి నేత లేదు. ఆకు ముట్టుకొంటేచాలు గుండయిపోతోంది. ఆ తుక్కు రోజూ యెత్తి పోయలేక కూతురు కొయ్యబారి పోతోంది! గుమ్మంముందాగి.

"తాతా! పన్నుకడతావా?"

ఊడిపోయిన పన్ను గానా తీసి కట్టాలితాత! ఉబ్బసంతో మూలుగుతున్నాడు. అల్లంత దూరంలో మగ్గంకూడా ముసుగుతన్ని పడుకొంది.

"ఏరదిబాబా! ఏటికిపన్ను?" అన్నాడు ముసలతను దగ్గుతూనే.

బిల్లుకలక్టరు కూలబడ్డాడు. ముసలతని కూతురు కాబోలు ముదుకొచ్చింది.

"ఏందెచ్చి కడతా మనుకున్నారండీ పన్ను? రెక్కాడితే డొక్కాడే వోళ్ళం! పుత్తి పడిపోయింది. మగ్గం మూలకి నెట్టేసుంది సూశారా! అసలు

మా సేనేతోళ్ళకి ఉప్పు గంజేనేక పోతేను." దీనంగా అంది.

బిల్లుకలక్టరు సగం కరిగిపోయాడు.

"ఎలా ఓలా, తలబద్దలు కొట్టయినా పన్ను కట్టాలి! కట్టకపోతే ఇల్లు జప్తుచేస్తారు! మీకు తెలియందేవుంది?" అన్నాడు కళ్ళల్లోకి చూస్తూ.

అమ్మాయి అలా అన్నందుకు సిగ్గుపడింది.

"ఏంతాతా! ఏమంటావ్?" అన్నాడు మళ్ళీ రెట్టిస్తూ.

"తిండికే లేకపోతే మేవేం గట్టం? మీయిష్టం వచ్చినట్లు చేసుకోండి! ఇక నన్ను గానా తాకట్టు పెట్టాల" అంది కొంచెం దురుసుగా.

బిల్లుకలక్టరుకి నవ్వొచ్చింది. కళ్ళల్లోకి చూశాడు. ఏం మార్పులేదు. నిరామయంగా అన్నట్టుంది. నిస్సహాయంగా అర్థించినట్టుంది.

"ఇదిగో అమ్మాయ్! వేళాకోళంగాదు. డబ్బుతో పని. పన్నుకట్టకపోయారా! నానాగొడవ. ఆఫీసర్లు పోలీసులు...ఎందుకొచ్చిందీ తంటా,"

"అసలీ గుడిసెకి పావలా, కాణీ పన్నుండేదండీ! అలాంటిది రెండురూపాయలు వేశారు."

"రేపొస్తాను. కట్టకపోయారా? హుఁ" అని బెదిరించి మళ్ళీ బయల్దేరాడు వసూళ్ళకి. ఎంత ఖచ్చితంగా మాట్లాడుతోందో! తన్ని తాకట్టుపెట్టాలట! అక్కడున్నంతసేపూ ఆ అమ్మాయితో మాట్లాడుతూంటే, అదోలా అనిపించింది. ఎలాగూ పన్నుకట్టలేరు. ఆ అమ్మాయి అన్నట్టు తనకి తాకట్టుపడేలాగే వుంది!

మధ్యాహ్నం ఆఫీసరడిగాడు. "పన్నులు బకాయీలున్నాయి! నువ్వుగానా కట్టుకొంటావా?" అని

ఆఫీసు లెక్కల్లో తలదూర్చి తీసేసరికి, నాలుగు దాటింది. అలా పొలాలవైపు పడినడిచి వద్దామనుకొన్నాడు. కాళ్లు తిన్నగా లాక్కుపోతున్నాయి. మంచినీళ్ళ చెఱువుదగ్గర్నుంచి మావిడి తోపులోకి మళ్ళించాడు. విసురుగా గాలి వీస్తోంది. వగరెక్కిన చివుళ్లు మెక్కిన కోకిల కొసరి కొసరి కూస్తోంది.

దూరంలోమంచి నీళ్ళచెరువుదగ్గర గబగబలూ, గుబగుబిలూ...బిందెల చప్పుళ్ళూ..వచ్చేవాళ్ళూ పోయేవాళ్ళూ అంతా సరభసంగా కన్నుల పండువుగా బిల్లు కలక్టరు కంటికి ఆకర్షణీయంగావుంది!.

ఎవరో తననిచూసి నవ్వుతున్నారు! ఆడవాళ్లే! అందులో పొద్దుటి పిల్లకూడావుంది. 'తాకట్టు పెట్టండి' అన్నదే, ఆ నంగనాచే, నవ్వుతోంది.

అతనికి సిగ్గేసింది ఆ నవ్వు.

అంతా ఒక్కొక్కళ్లే జారుకొంటున్నారు. కనుచీకటి పడుతోంది. ఆ అమ్మాయిని దగ్గరికి పిలిచాడు. ఏమిటి సంగతీ? అన్నట్టు.

చెంగు నోట్లో కుక్కుకొంటూ, నిలబడింది.

"నన్ను చూసి నవ్వుతున్నా రెందుకూ?" అన్నాడు బిక్కుబిక్కుమంటూ.

"మిమల్ని జూసి మేవేం నవ్వేమంటారా? మాకేం నోళ్లు కొవ్వెక్కనే దండోయ్" అంది. చిక్కని చివుళ్ళు కనపడేలా నవ్వుతూ.

"రేపొస్తా. పన్నుకట్టెయ్యాలి! అదిగో ఇదిగో అంటే చాలా గొడవవుతుంది."

డక్కను సిగరెట్టు పెట్టితీసి, అగ్గిపుల్లవెలిగిస్తూ అన్నాడు. గాలి విసురుకి మంట ఆరిపోయింది. నాలుగయిదు పుల్లలు తగలడ్డాయి.

"అయ్యో! అయ్యో! అగ్గిపెట్టి ఆకరు సేసియ్యకండి! నా సెంగడ్డ మెడతా" అంటూ అడ్డంగా నిలబడింది. ఏదోఉపకారం చేయబోయే అపకారం యెదురైందంటారు. బిల్లుకలక్టరు సిగరెట్టు దివ్యంగా వెలిగింది. అగ్గిపుల్ల చేతిలో చురుక్కుమనేదాకా అతనిలో చేతనంలేదు. పుల్ల, ఆ పిల్ల కాలిమీద పారేశాడు. ఎగిరి గంతేసింది.

"అమ్మో" అంటూ రాతిబెడ్డమీద కాలుపడి జర్రున జారింది. పచ్చగడ్డిలో పచ్చగాపడింది.

"అయ్యో పాపం! ఎంత పనిజరిగిందీ?" అంటూ దగ్గరికొచ్చి లేవదీసి మట్టి దులిపాడు బిల్లుకలక్టరు.

"ఛీ...ఎవరేనా చూస్తే ఇంకేవన్నా ఉందా?"

"ఎవరూ చూడలేదు. చూడకూడదు కూడా; ఎవ్వరూ చూడరులే"-ముసిముసిగా నవ్వుతూ కళ్ళని సిగ్గుతో తడిపేసింది. పెదవులు ఎర్రబడి కందిపోయాయి. బుగ్గనిండాసిగ్గు పొంగింది.

"మీకు పెళ్ళవలేదూ?...ఏం సదువుకున్నారు ఈ ఉద్యోగాని కేవిత్తారూ?" అంది అమాయికంగా నిలబడి అతని జీవితం పరామర్శిస్తూ.

బిల్లుకలక్టరు తగిన సమాధానం చెప్పుకున్నాడు. "మీరు గూడా పేదోరేనే పాపం" అంది మనసులో మైనంలా కరిగిపోతూ.

"అమ్మో! సిమ్మసీక టడిపోయింది" అంది భయంగా బిల్లుకలక్టరుదగ్గరగా వచ్చి, "నే తీసు కెళ్లి దిగపెడతా రా!" అంటూ ముందుకు నడి చాడు. ఆ చీకట్లో ఇద్దరూ నీడల్లా అంటుకుని వెళ్ళిపోయారు.

తిరిగి ఆఫీసుదగ్గరికి చేరుకోబోతుంటే బేటరీ రేడియోలోంచి వార్తలు వినిపిస్తున్నాయి. ఆకలి రోకలితో పోటుపెడుతోంది. ఇక ఇంటికి కెళ్ళ డానికి బస్సూ, రైలూ ఏంలేవు. ఆఫీసులో గోనె మీద ఫైళ్ళూ బిల్లుముక్కలూ నెత్తికింద పెట్టు కుని కలలు కంటూ కునుకు తీయాల్సిందే!

హోటలు ముందు నుంచున్నాడు. ఏవిటా అని సందేహిస్తూ. నజీరుద్దీను, "రా భాయీ! యేడీ— యేడీ ఛాయ్ ఉంది"అంటూ ఆహ్వానించాడు.

ఇక తప్పదని బెంచీ ఎక్కి కూచున్నాడు. టీ కలిపి గ్లాసుతో అందించాడు. "ఏటండీ! బిల్లు కలక్టరుగారూ!పన్నులు జాస్తీవేసారు. అమ్మకాలు తక్కువైపోయినాయి;పాకమీద పదీరూపాయలు పన్ను ఎక్కడిచ్చుకోమంటారూ?" నజీముద్దీన్ పురాణం వినడానికి రాలేదు. తల దిమ్మెక్కిపో తోంది వాళ్ళవాళ్ళ మాటలువిని—'పిటీషన్ పెట్టండి' అని ఎంతమందితోనో చెప్పాడు.

ఆతలబాధ మధురబాధగా పరిణమించింది మావిడి తోపులో. తియ్యని మనసు తనకి రుచి చూపెడుతోంది. ఆ మధుర ఘడియలో ఈ పన్నుల, ఆ పన్నుల బాధ మరిచిపోయి, హాయిగా ఊపిరి పీలుస్తాడు.

అణా చేతిలోపెట్టి, తిన్నగా ఆఫీసుకి వెళ్ళి పక్క సిద్ధం చేసుకుంటుంటే, అంతా తనవేపే ఆశ్చర్యంగా చూశారు "ఇవ్వాళ పన్నుల హడావు డిలోవుండి ఇంటికెళ్ళలేదోయ్" అని సమాధానం చెప్పి ఊరుకొన్నాడు. ఇంకా తనపని పూర్తి కాలేదు! అర్ధరాత్రి పదకొండు గంటలకి తనకి ఆహ్వానం వినిపిస్తుంది!

* * *

పంచాయతీ ఆఫీసరు పన్నుల బాకీలు చూస్తూ "ఇంకా ఎంతమంది మిగిలాయి?"అనడిగాడు.

"దాదాపు పూర్తయిపోయినట్టేనండి"

"ఇంకా సాలి నారయ్య బాకీ అట్టే వుండి పోయిందే? జప్తుచేయాలా?"

బిల్లుకలక్టరు తబ్బిబ్బయాడు. ఇంకా బాకీ ఉన్నట్టుంది. ఎలాగో ధైర్యంచేసి, "అహఁ అక్కర్లే దండి! నిన్న వాళ్ళమ్మాయి బాకీ తీర్చేసిందండి. నాదగ్గ రేవుంది!"

బిల్లుకలక్టరు పర్సులోంచి దానితాలూకు సొమ్ముతీసి ఇచ్చేశాడు.

"రాత్రి ఇంటికి వెళ్ళలేదూ?"అన్నాడు తాపీగా సిగరెట్టు ముట్టిస్తూ ఆఫీసరు.

"లేదండీ! లెక్కలు పూర్తిచేయటం ఫైళ్ళల్లో ఎక్కించటంలో ఆలస్యమైపోయింది. బండందలే" సాకు చెపుతున్నట్టు వినిపించింది ఆఫీసరుకి.

"అఁ ఊరు మునిగిపోలేదు లేవోయ్! అంత ఆలస్యం చేయడానికి" అని ఊరుకొన్నాడు.

ఆ రోజునించి రాత్రిళ్ళు అక్కడే వుండి పోతున్నాడు ఇంటికెళ్ళకుండా. కేరేజి బస్సు లోంచి వస్తూండేది. ఎనిమిదిగంటలు కొట్టేసరికి మామిడి తోపులో మమతలు సాగించేవాడు నారయ్యకూతురు రావులమ్మతో.

రావులమ్మ ... రావులమ్మ పేరు తనకెంతో తియ్యని ఆశ అందిస్తోంది. ఎలా అనుబంధం కలిసి పోయిందో తనకే అర్థంకాకుండావుంది. ఇంతకీ రావులమ్మలో చొరవ, సాహసం తనని ప్రేరే పించాయి అని సమాధానపడి ఊరుకొన్నాడు.

ఇంటిదగ్గర్నుంచి కబుర్లమీద కబుర్లొచ్చి పడు తున్నాయని ఒక్కసారి ఇంటికెళ్ళాడు. తల్లీ ఇంట్లోవాళ్ళూ అంతా రావడం మానేయడానికి కారణాలు వర్షించారు. తలొక్కళ్ళకీ తలో సమాధానం చెప్పుకుని వాళ్ళని నమ్మించడానికి ప్రయత్నించాడు.

పల్లె వదిలిన మర్నాటినించీ, పెద్ద ముసురు పట్టుకొంది. ధారాపాతంగా వర్షం....తుపాను! రైళ్ళూ, బస్సులూ వెళ్ళడం మానేశాయి. చెరువు లకి గడ్లు పడ్డాయి. కాలువలు పొంగాయి. అలా నాలుగురోజులు జరిగిందో లేదో పల్లెటూళ్ళో జనం వరదలో కొట్టుకురావడం ప్రారంభించారు. తన తల తిరిగిపోతోంది! అక్కడ ఊరు మున్గి పోతోంది!

తనూ,... తనజీతం,... పంచాయితీబోర్డు... రావులమ్మ అంతా తనకళ్ళముందునుంచి, మామిడి తోపుల్లోంచి కొట్టుకుపోతున్నారు! ★